క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో హెటిరో డ్రగ్స్, రేండ్‌స్టాండ్, తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసుండి, పది నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 94405 37105 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వంటపాత్రల పంపిణీ



తుమరాడ పాఠశాలలో వంటపాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: మండలంలోని 55పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులకు వంటపాత్రలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ-1 సామల సింహాచలం తెలిపారు. మండలంలోని తుమరాడ ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించి వంటపాత్రలను నిర్వాహకులకు అందించారు. పాఠశాలలతో మెనూ పరిశీలించి వంటలు రుచి చూసి సంతృప్తి చెందారు. విద్యార్థులకు మంచి భోజనాన్ని వండి పెట్టాలని సూచించారు. పాఠశాలను పర్యవేక్షించి విద్యార్థులచేత పాఠ్యపుస్తకాలు చదివించి విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లు పరిశీలించి దిద్దుబాట్లు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకరరావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకరరావు అన్నారు. పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంక్‌ల వద్ద ఏ విధంగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి... వాటిని ఎలా నివారించాలన్న అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, నాగరాజు, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు



చప్పబుచ్చమ్మపేటలో పర్యటిస్తున్న ఉపాధి హామీ పథకం సిబ్బంది

మక్కువ: మండలంలోని చప్పబుచ్చమ్మపేట, మార్కొండపుట్టి పంచాయతీల్లో ఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి పనులు గుర్తించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏయే పనులు చేపట్టాలో గుర్తించి, వేతనదారులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చప్ప సూర్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జగనన్న ఆరోగ్య సర్వే



లచ్చయ్యపేటలో మాజీ సర్పంచ్ సూర్యకుమారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీతానగరం: ప్రభుత్వం అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏసీ) పథకం అమలులో భాగంగా బుధవారం మండంలోని లచ్చయ్యపేటలో వైద్యసిబ్బంది వలంటీర్లతో కలిసి ఆరోగ్య సర్వే చేశారు. ఈ మేరకు ప్రతి ఇంటికీ ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, గ్రామ వలంటీర్లు వెళ్లి 18 రకాలవైద్య పరీక్షలు నిర్వహించారు. సర్వేలో పాల్గొనే వారందరికీ వ్యాధి లక్షణాలను గుర్తించి త్వరలో జరగనున్న జగనన్న ఆరో సురక్ష ఉచిత వైద్య శిబిరంలో వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు చేసి తదుపరి అవసరాన్ని బట్టి చర్యలు తీసుకుంటారని సర్వే సిబ్బంది తెలిపారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా లక్ష్మి

గరుగుబిల్లి: మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా గంట లక్ష్మి బుధవారం ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం స్థానిక వైఎస్సార్ వెలుగు కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామైఖ్య సంఘ సభ్యులతో నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా అధ్యక్షురాలిగా గంట లక్ష్మి, కోశాధికారిగా బోను స్వర్ణలత, కార్యదర్శిగా మరడాన అనసూయను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం పి.అప్పలనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

సీతానగరం: జిల్లావ్యాప్తంగా సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ బి.జగన్నాథరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన సీతానగరం మండల కేంద్రం పీహెచ్‌సీ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో చేపట్టిన జేఏఎస్ కార్యక్రమాన్ని పరిశీలించారు. శిబిరం వద్ద ఏర్పాటుచేసిన ప్రతికౌంటర్‌లో అందజేస్తున్న వైద్యసేవలు, రిజిస్ట్రేషన్, టోకెన్ల జారీ, నిర్వహించిన పరీక్షలు, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి ఆరాతీశారు. అక్కడ వైద్యసేవలు వినియోగించుకోడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఏఎస్ హెల్త్ క్యాంప్‌లకు రెండు వారాలముందుగానే ఆ పరిధిలో వైద్యసిబ్బంది, గ్రామవలంటీర్లు ఇంటింటి ఆరోగ్య సర్వే ప్రారంభించి పూర్తి చేసి అవసరమైన వారికి టోకెన్లు అందజేశారని, వారికి ఆ గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆరోగ్య తనిఖీలు చేపట్టారని, అందుకు ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులను శిబిరంలో నియమించినట్లు చెప్పారు. ప్రతి క్యాంప్ వద్ద కంటి వైద్య శిబిరం, అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్ ఏర్పాటు చేశారన్నారు. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న జేఏఎస్ హెల్త్‌క్యాంప్‌ల పర్యవేక్షణకు ప్రోగ్రాం అధికారులను నియమించినట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జేఏఎస్ హెల్త్‌క్యాంప్‌లు కొనసాగుతున్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, తహసీల్దార్ ఎన్వీ రమణ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములు యుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ ఎం.శ్రీదేవి, ఎంపీటీసీ సీహెచ్ జగదీష్, ఉపసర్పంచ్ ఆర్‌వీ రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, ఈఓపీఆర్డీ కె కుమారవర్మ, ఐసీడీఎస్ ఎస్‌ఓ పూర్ణిమ, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వైద్యసేవల గురించి మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

సద్వినియోగం చేసుకోవాలి...

పాచిపెంట: జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బద్నాన ప్రమీల అన్నారు. మండలంలోని పద్మాపురం గ్రామ సచివాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ బడ్నాన వీరయ్య ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దీర్ఘకాలిక రోగులకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు మాట్లాడుతూ, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్, పార్టీ జిల్లా కార్యదర్శులు పాచిపెంట వీరనాయుడు, కొలువలపల్లి పెద్దిబాబు, వైస్ ఎంపీపీ కొల్లి రవీంద్రనాథ్, ఎంపీటీసీ సభ్యులు కాదల అన్నపూర్ణ, దండి ఏడుకొండలరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సలాది అప్పలనాయుడు, నాయకులు శానాపతి నారాయణరావు, బోను ధనుంజయరావు, మురళి మూకల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంట: రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంగళరాయసాగర్‌లో చేప పిల్లల విడుదల



వెంగళరాయసాగర్‌లో చేప పిల్లలను విడిచిపెడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాలూరు: మండలంలోని అన్నంరాజువలస సమీపంలో గల వెంగళరాయసాగర్‌లో సుమారు 8 లక్షల చేప పిల్లలను వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, తదితరులు బుధవారం విడుదల చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా 5.94 లక్షల చేప పిల్లలు, లైసెన్స్ పథకం కింద 2 లక్షలు చేప పిల్లలు విడిచిపెట్టినట్లు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఫిషరీష్ అధికారులు నిర్మలాకుమారి, తిరుపతయ్య తెలిపారు. మత్స్యకారులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ మరింత ఆర్థిక వృద్ధి సాధించాలని ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు అనూష్, ఎంపీడీఓ పార్వతి, జిల్లా మత్స్యకార, సహకార సంఘాల నాయకులు, ఫిషరీష్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఇంటర్‌మీడియట్ సర్టిఫికెట్లు



ప్రిన్సిపాల్ రామారావు

పార్వతీపురం టౌన్: 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంబంధించిన ఒరిజినల్ మార్క్స్ మెమో, పాస్ సర్టిఫికెట్ పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకున్నాయని ప్రిన్సిపాల్ జె. రామారావు అన్నారు. ఈ మేరకు బుధ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్క్స్ మెమోలను త్వరితగతన విద్యార్థులకు అందజేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వాటికోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యం మెరుగుపరిచేందుకే జేఏఎస్



బర్లిలో జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్యులనుండి వివరాలు తెలుసుకుంటున్న జమ్మాన

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన

బలిజిపేట: రోగుల ఆరోగ్యం మెరుగు పరచడం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని బర్లిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరై శిబిరానికి వచ్చిన రోగుల వివరాలు, వారికి తగిన విధంగా వైద్యసేవలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

అనారోగ్యంతో బాధపడేవారికి ఉచితంగా వైద్య సేవలు అందించేందుకే ఈ పథకం ప్రవేశపెట్టారని, దానికి అనుగుణంగా వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

- జిల్లా ప్రణాళికాధికారి వీర్రాజు



మాట్లాడుతున్న జిల్లా ప్రణాళికాధికారి పి.వీర్రాజు

పార్వతీపురం: శాఖాపరంగా అప్పజెప్పిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా ప్రణాళికాధికారి పి. వీర్రాజు అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో క్రాప్ శాంపిలింగ్ విధానంపై రెవెన్యూ సిబ్బందికి నిర్వహించనున్న ఏడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపాతం నమోదు, రైతులు ఆయాప్రాంతాల్లో పండించే సీజనల్ పంటలు సాగుచేస్తున్న విస్తీర్ణం నమోదు, పంటకోత ప్రయోగాలు తదితర అంశాలపై నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. అడంగల్ నమోదు, పంట దిగుబడి అంచనా, చిన్న, సన్నకారు రైతుల గుర్తింపు ఏవిధంగా సర్వే నిర్వహించాలన్నది పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గణాంకాధికారి కేబీఆర్ ఆచార్యులు, శిక్షకుడు వైవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

వేడుకగా స్వామివారి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం: పట్టణంలోని రాయగడ రహదారిపరిధిలో ఉన్న శ్రీ ఆంజనేయ, శ్రీ వెంకటేశ్వరస్వామి, గోదా రంగనాథ ఆలయంలో బుధవారం వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్ల కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆంజనేయ స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఆలయంలో శ్రీవెంకటేశ్వరస్వామివారికి అర్చకులు కుమారభట్టర్ గోపినాథాచార్యులు వివిధ గ్రామాలనుంచి వచ్చిన దంపతులతో వైభవంగా కల్యాణం నిర్వహించారు. వీరఘట్టానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సూచనల మేరకు ప్రతి బుధవారం ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులు ప్రసాదాలను, శేషవస్త్రాలను అందించడంతోపాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులు, వలస కార్మికులు ఈశ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ కమిషనర్ ఎం.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈశ్రమ్ పోర్టల్ ద్వారా యూనివర్సిల్ అకౌంట్ నంబర్లు కేటాయించి గుర్తింపుకార్డు ఇస్తాయని తెలిపారు. వలస కార్మికులకు రేషన్ కార్డులు కావాలన్నా, ఎటువంటి సమస్యలున్నా దగ్గరలోని కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం కలిగిన కార్మికులకు రూ.2లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీ, డీఆర్‌డీఏ పీడీ, ఉప కార్మిక కమిషనర్, డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేసి దరఖాస్తుల పరిశీలన, అప్‌లోడింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్

- డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్

పార్వతీపురంటౌన్: విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి, సెట్విజ్ సీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురంలోని ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా స్థాయి యోగాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కనబరచి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి తమతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు వాసుదేవరావు, గాంధీ, జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు

పార్వతీపురంటౌన్: ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసిందని ఏపీటిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని జమదాల గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, అందులో భాగంగా ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు ,సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

ఉపాధి పనుల గుర్తింపుపై అవగాహన



పనుల గుర్తింపు క్యాలెండర్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీహరి

సీతానగరం: మండలంలో ఉపాధి పనుల గుర్తింపుపై క్షేత్ర సహాయకులు రూపొందించిన క్యాలెండర్‌పై పథకం నిర్వాహక అధికారులు అవగాహన కల్పించుకోవాలని డ్వామా ఏపీడీ(సాలూరు)శ్రీహరి కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని సూరంపేటలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాలవారీగా గుర్తించిన పనులు ఏనెలలో ఎన్ని చేయాలి? ఎంతమందికి పనులు కల్పించాలనే అంశాలపై వివిధ రంగులతో కూడిన జనవరి నుంచి డిసెంబర్ వరకూ క్యాలెండర్ రూపొందించి పనులను ప్రారంభించే అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో నిర్వహించిన ప్రణాళికలు, కాలమాన పట్టిక ఆధారంగా పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో వేతన దారులందరికీ తెలియజేసి పనులు కల్పించడానికి టెక్నికల్ సహాయకులు సమాయత్తం కావాలని కోరారు. గ్రామాల్లో అర్హులైన వారందరికీ ఉపాధి కల్పించడమే కాకుండా సామాజిక పరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ భాను, జేఈ కృష్ణ, టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో మంచినీటి పథకం పనులు



లచ్చయ్యపేటలో ఇంటింటి కుళాయి పనులను పరిశీలిస్తున్న ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో ప్రజలకు తాగునీరు సరఫరా చేయడానికి ఇంటింటి కుళాయి పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన లచ్చయ్యపేటలో ఇంటింటి కుళాయిల నిమిత్తం వేస్తున్న పైప్‌లైన్లు, నూతనంగా నిర్మాణం చేస్తున్న ఓవర్ హెడ్‌ట్యాంక్, ట్యాప్‌ల ఏర్పాటును పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ పథకం ద్వారా అందరికీ తాగునీరు సౌకర్యం కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం నిధులు మంజూరుచేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ ఎ.సింహాచలం, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

పెదబోగిలిలో...

మండలంలోని పెదభోగిలి ఎస్సీ, బీసీ కాలనీల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం పెదభోగిలి పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.గౌరి, పీఏసీఎస్ చైర్మన్ ఎస్ కూర్మారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇజ్జాడ సింహాచలం, ఇంజనీరింగ్ సహాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో 436 మందికి వైద్యసేవలు



బర్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

బలిజిపేట: మండలంలోని బర్లిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో శిబిరంలో 436 మందికి వైద్యసేవలు అందించారని తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు. ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ శిబిరానికి హాజరై రోగులకు అవసరమైన వైద్య సేవలు అందుతున్నదీ లేనిదీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో విద్య, వైద్యంతో నిరుపేదల కుటుంబాలలో వెలుగులు నిండుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యబృందం పాల్గొని అన్నిరకాల సేవలు అందించారు. మొత్తం 436మందికి వైద్య సేవలు అందించగా అవసరమైన వారిని రిఫరల్ చేసినట్లు వైద్యులు తెలిపారు. వైద్యసేవలు పొందే వారికి మందులతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో కూడిన కిట్లను అందించారు. వలంటీర్లు, వైద్యశాఖ ఇంటింటికి సర్వే చేసి ఇచ్చిన టోకెన్ల ప్రకారం వచ్చిన వారికి సేవలు అందించారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు ప్రత్యేక వైద్యసేవలు అందించినట్లు చెప్పారు.

ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం



పనసబద్రలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మక్కువ: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పనసబద్రలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అని చెప్పారు. నాడు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టగా, నేడు ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ పథకాన్ని కొనసాగించడంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీదరపు గంగమ్మ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఈఓపీఆర్‌డీ పి.దేవకుమార్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.